క్లుప్తంగా

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అయ్యప్పస్వాములతో డీఎం వెంకటనర్సయ్య

రాయికల్: అయ్యప్ప భక్తులు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల డిపో మేనేజర్ వెంకటనర్సయ్య కోరారు. సోమవారం రాయికల్‌లోని అయ్యప్ప ఆలయంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో శబరిమలకు రాయితీలో బస్సులను అద్దెకిస్తున్నామన్నారు. వివరాల కోసం 99592 25925 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వాములు సింగని రమేశ్, కల్లూరి నారాయణ, స్వాములు కిశోర్‌రావు, శ్రీనివాస్ రావు, రంజిత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

జగిత్యాల: జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎండీ.షబీర్ ఇటీవల చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన ఆన్‌లైన్ ప్రాజెక్ట్ ప్రజంటేషన్ పోటీల్లో విజేతగా నిలిచాడు. సోమవారం విద్యార్థికి ఎలక్షన్ కమిషన్ వారు ప్రశంసా పత్రంతో పాటు, రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థిని అభినందించి కళాశాలకు గర్వకారణమని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ పాలకవర్గం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పాలకవర్గం

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, కౌన్సిలర్లు మహేందర్, కాంతారావు, తురగ శ్రీధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాయకుల శుభాకాంక్షలు

సారంగాపూర్: బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంపై పలు గ్రామాల్లో మిఠాయిలు పంచి, బాణాసంచాలను పేల్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన విజయానికి కష్టపడ్డ ప్రతీ కార్యకర్తలు రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు



పెగడపల్లి: మండలంలోని నంచర్ల సహకార సంఘంలో యాసంగి సాగుకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్, సీఈవో రాతు మధుకర్ సోమవారం తెలిపారు. ఎంటీయూ రకం విత్తనం 25 కిలోల బస్తా రూ. 881, కేఎన్ఎం రకం విత్తనం 25 కిలోల బస్తా రూ. 881కు విక్రయిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేవంత్‌ను కలిసిన ఆది శ్రీనివాస్



వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపుపొందిన ఆది శ్రీనివాస్ సోమవారం ఆది హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ల కొరత

- ట్రాన్స్‌కో సిబ్బందిపై అదనపు భారం
- మండలంలో 50 శాతం ఆర్టీజెన్ల కొరత
- విద్యుత్ సమస్యల పరిష్కారంలో జాప్యం



భూషణరావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్టీజెన్

కథలాపూర్: రోజురోజుకి విద్యుత్ వినియోగం పెరుగుతుంటే.. దానికి తగ్గట్లుగా ట్రాన్స్‌కో అధికారులు సిబ్బంది నియామకంపై దృష్టిసారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఉన్న సిబ్బందితో నెట్టుకు రావడంతో విద్యుత్ సమస్యలు వస్తే పరిష్కారంలో జాప్యం జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. దీనికి నిదర్శనం కథలాపూర్ మండలంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్(ఆర్టీజెన్)ల కొరత. ఆర్టీజెన్ల కొరతతో గ్రామాల్లో పనిచేసే ట్రాన్స్‌కో జేఎల్‌ఎంలతో నెట్టుకొస్తున్నారు. పూర్తిస్థాయి ఆర్టీజెన్లు ఉంటే జేఎల్‌ఎంలపై అదనపు భారం పడదని, విద్యుత్ సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే వీలుంటుందని ప్రజలు భావిస్తున్నారు.

మండలంలో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లు.. 13 మంది ఆర్టీజెన్లు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. కథలాపూర్, భూషణరావుపేట, బొమ్మెన, చింతకుంట, తాండ్య్రాల, గంభీర్‌పూర్, అంబారిపేట గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లలో కథలాపూర్ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌ను ఆపరేటింగ్ కోసం నలుగురు ఆర్టీజెన్లు అవసరం కాగా.. ఆరు సబ్‌స్టేషన్లకు గాను 24 మంది ఆర్టీజియన్లు అవసరం. కానీ 13 మంది మాత్రమే ఆర్టీజెన్లు ఉన్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌లో ఒక రోజుకు మూడు షిఫ్టులల్లో ఒక ఆర్టీజియన్ 8 గంటలు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆర్టీజియన్ల కొరత కారణంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఆర్టీజియన్‌లతోపాటు ట్రాన్స్‌కో జేఎల్‌ఎంలు ఆపరేటింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.



సబ్‌స్టేషన్‌లో ఆర్టీజెన్ల కోసం నిర్మించిన గది

గ్రామాల్లో సమస్య వస్తే ఇబ్బంది

మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆపరేటింగ్ చేసే ఆర్టీజెన్ల కొరత కారణంగా ట్రాన్స్‌కో జేఎల్‌ఎంలు సబ్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వస్తే సంబంధిత జేఎల్‌ఎం నిమిషాల్లో అక్కడకు చేరుకొని పరిష్కరించాల్సి ఉంటుంది. జేఎల్‌ఎంలు సబ్‌స్టేషన్‌లో ఉంటే గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ పోతే మరమ్మతులో జాప్యం జరుగుతుందని ప్రజలు అంటున్నారు. పొద్దంతా విద్యుత్ సమస్య వస్తే ఏమోగానీ రాత్రివేళ జరిగితే ఏలా అని ఆయా గ్రామస్తులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు దృష్టిసారించి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో సరిపడేలా ఆర్టీజెన్లను నియమించి.. ట్రాన్స్‌కో జేఎల్‌ఎంలను వారికి కేటాయించిన గ్రామాల్లో యథావిధిగా విధులు నిర్వహించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్య వస్తే గంటల తరబడి నిరీక్షణ



మండలంలో సిరికొండ గ్రామం పెద్దది. ఈ గ్రామంలో ట్రాన్స్‌కో జేఎల్‌ఎం లేరు. ఇతర గ్రామాల జేఎల్‌ఎంలతో తాత్కలికంగా నెట్టుకొస్తున్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, గ్రామంలో వైర్ల సమస్య వస్తే ఎవరికి ఫోన్ చేసుడో అర్థం కాదు. మా గ్రామంలో ఏ జేఎల్‌ఎం డ్యూటీ చేస్తారో తెలియని పరిస్థితి. ఇట్లుంటే అత్యవసర పరిస్థితుల్లో ఏలా ఉంటుంది. ప్రతీ గ్రామానికి ఒక జేఎల్‌ఎం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– కొడిపెల్లి నరేందర్‌రెడ్డి, రైతు, సిరికొండ

ఆర్టీజియన్ల కొరత వల్ల జేఎల్‌ఎంలకు విధులు



విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆరీజెన్ల కొరత ఉంటే ఆయా గ్రామాల జేఎల్‌ఎంలు సబ్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించాల్సిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జేఎల్‌ఎంలకు సబ్‌స్టేషన్‌లలో విధులు కేటాయిస్తున్నాం. విద్యుత్ సమస్యలుంటే ప్రజలు చెప్పగానే పరిష్కారానికి కృషి చేస్తాం.

– రఘుపతి, ట్రాన్స్‌కో ఏడీఈ, కోరుట్ల రూరల్

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



మేడిపల్లి లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో సోమవారం మేడిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. నాలుగుసార్లు ఓడిపోయినా.. ఆది శ్రీనివాస్ అనునిత్యం ప్రజల్లో ఉండడంతో భారీ మెజారిటీతో గెలిచారని తెలిపారు. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న శీనన్నకు మంత్రిమండలిలో చోటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బద్దం రాజేందర్ రెడ్డి, మార్గం నర్సారెడ్డి, శ్రీపతి దామోదర్, చేపూరి నాగరాజు, స్వామిగౌడ్, జలందర్ రెడ్డి, లాజర్, సాయిని గంగారెడ్డి, కంటీ పోచయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో దివంగత మహానేత, మాజీ సీఎం వై ఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ గెలిచి రైతు రాజ్యం వచ్చిందని నాయకులు నినాదాలు చేశారు. అనంతరం కథలాపూర్, తాండ్య్రాల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు కాయితి నాగరాజు, ఎం.డీ అజీమ్, అల్లూరి దేవారెడ్డి, తొట్ల అంజయ్య, హరిప్రసాద్, జీవన్‌రెడ్డి, సంతోష్, కృష్ణచారి పాల్గొన్నారు.

సేకరించిన చెత్త పెంట పాలు

- నిరుపయోగంగా వర్మి కంపోస్ట్ కేంద్రాలు
- చెత్తను ఆరుబయటే పారేస్తున్న వైనం
- జాడలేని ఎరువుల తయారీ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కంపోస్ట్ షెడ్డు పక్కన పారబోసిన చెత్తా చెదారం

మెట్‌పల్లిరూరల్: ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్న లక్ష్యం నెరవేరడంలేదు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు ఆదాయం పెంపొందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వర్మి కంపోస్ట్ షెడ్లు నిరూపయోగంగా మారాయి. వీటి కోసం రూ.లక్షలు ఖర్చు చేసిన ఫలితం లేకుండా పోయింది.ఎరువుల తయారీ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడంతో చెత్త పెంటపాలవుతోంది.

ఖాళీగానే కంపోస్ట్ షెడ్లు..

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో వర్మి కంపోస్ట్ షెడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.గ్రామ శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ ఒక్కో కంపోస్ట్ షెడ్డు రూ.2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. వాస్తవానికి జీపీ సిబ్బంది తడి,పొడి చెత్తను సేకరించి కంపోస్ట్ షెడ్లకు తరలించాలి.అంతేకాకుండా అందులోని ప్లాస్టిక్,ఇతర వస్తువులను వేరు చేయాలి. వ్యర్థ పదార్థాలు, కూరగాయాల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ ఈ ప్రక్రియ ఎక్కడ కూడా జరగడం లేదు. ఫలితంగా వర్మీ కంపోస్ట్ కేంద్రాలు వృథాగా మారిపోయాయి.



వెల్లులలో నిరూపయోగంగా కంపోస్ట్ షెడ్డు

ఆసక్తి చూపని అధికారులు

గ్రామాల్లో సేకరించిన చెత్త పెంటపాలవుతోంది. చెత్తను శివారు ప్రాంతాల్లో ఏదో ఓ చోట పారవేస్తున్నారు. అంతేకాకుండా కొన్నిచోట్ల చెత్తకు నిప్పు అంటిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రహదారుల పక్కనే చెత్తను పడేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంపోస్ట్ షెడ్ల ఏర్పాటు విషయంలో మొదట్లో ఆసక్తి చూపిన అధికారులు ప్రస్తుతం వాటి వైపు కన్నెత్తి చూడకపోవడంతో విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

చిత్ర కథ: అస్తవ్యస్తంగా కేజీబీవీ రహదారి



పెగడపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి వెళ్లే రహదారిని మెరుగుపరచాలని విద్యార్థినులు, టీచర్లు కోరుతున్నారు. గ్రామ శివారులోని ఎగ్గలకుంట ప్రాంతంలో ఏళ్ల క్రితం పాఠశాల భవనం నిర్మించారు. అయితే ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి పాఠశాల వరకు సిమెంట్ రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సిమెంట్ రహదారి నిర్మించి అవస్థలు తొలగించాలని సిబ్బంది, విద్యార్థినులు సంబంధిత కోరుతున్నారు.

శిథిలావస్థలో అధికారుల క్వార్టర్లు



ఇబ్రహీంపట్నంలో శిథిలావస్థలో ఉన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ క్వార్టర్

ఇబ్రహీంపట్నం: అటవీశాఖ అధికారులు స్థానికంగా ఉండేందుకుగాను 60 ఏళ్ల క్రితం కట్టిన నివాస గృహలు శిథిలావస్థకు చేరాయి.దీంతో అధికారులు అద్దె ఇండ్లలోనే నివాసం ఉంటున్నారు. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకునే వరకు అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో అధికారులు అందులో ఉండేందుకు భయపడుతున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నివాసం కూడా శిథిలావస్థకు చేరింది. 1996 లోరూ.6 లక్షలతో నిర్మించిన మయూరి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ క్వార్టర్‌లో నీటి వసతి, విద్యుత్ వసతి లేక నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన క్వార్టర్లను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే భవనాలు నిర్మిస్తామని మెట్‌పల్లి రేంజ్ అటవీ ఆఫీసర్ ఎండీ సాకత్ ఆలీ తెలిపారు.



నిరుపయోగంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ క్వార్టర్

ఎమ్మెల్యేలను కలిసిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: కోరుట్ల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్‌ను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు ఎమ్మెల్యేలుగా గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు చీటి విద్యాసాగర్ రావు, గుండారపు గంగాధర్, అంగిరి రాజు, ఓంకార్ ఉన్నారు.

తొలి గెలుపులో తండ్రి కొడుకులిద్దరూ ప్రతిపక్షంలోనే



విద్యాసాగర్‌రావు



సంజయ్

మెట్‌పల్లి: నిన్నటి దాకా ఎమ్మెల్యేగా వ్యవహరించిన కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన తనయుడు కల్వకుంట్ల సంజయ్ తొలిసారి విజయం సాధించిన సమయంలో టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్‌ఎస్) పార్టీ ప్రతిపక్షంలోనే ఉండడం గమనార్హం. 1998లో రాజకీయ అరంగేట్రం చేసిన విద్యాసాగర్‌రావు అదే సంవత్సరం పాత మెట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం 2004 సాధారణ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా మరోసారి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన కోరుట్ల నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, టీఆర్‌ఎస్ ప్రతిపక్షంలో ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014, 2018లో జరిగిన ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. ఈ రెండు పర్యాయాలు టీఆర్‌ఎస్ అధికారంలో ఉండడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకవచ్చారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఆయన తన తనయుడు సంజయ్‌ని పోటీ చేయించగా, విజయం సాధించారు. కానీ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాలేదు. తీవ్ర పోటీలో సంజయ్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ.. పార్టీ అధికారంలోకి రాకపోవడం బీఆర్‌ఎస్ శ్రేణులను కొంత అసంతృప్తికి గురి చేస్తోంది.

యథేచ్ఛగా ప్లాస్టిక్ విక్రయాలు

జగిత్యాలటౌన్: ప్లాస్టిక్ నిషేదం ప్రకటనలకే పరిమితమవుతోంది. విక్రయాలు, వినియోగం యథేచ్ఛగా సాగుతున్నాయి. వ్యాపారుల లాభాపేక్ష, అధికారుల అలసత్వం, ప్రజల అవగాహనా లేమితో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. నామ మాత్రపు తనిఖీలు, కొద్ది పాటి జరిమానాలతో సరిపెట్టడంతో ప్లాస్టిక్ విక్రయాలపై ప్రభుత్వం విధించిన నిషేదం నీరుగారిపోతోంది. ప్లాస్టిక్ నిషేదిస్తూ ప్రభుత్వం జీవో తెచ్చినా బల్దియా అధికారుల అలసత్వం, ప్రజల నిర్లక్ష్యం తో ప్లాస్టిక్ వినియోగం అంతకంతకు పెరిగిపోతుంది. ఇప్పటికైనా అదికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.